

# పసిడిమనసులు - షర్మిల



## తాతారావు ఇల్లు

**మర్రిపాలెం** అంటే పల్లెటూరు అనుకునేరు. వైజాగ్ లో కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, మువ్వలవాని పాలెం ఇట్లా వున్న బోలెడు పాలెంల్లో మర్రిపాలెం ఒకటి.

మా వూరు నుంచి వైజాగ్ వచ్చిన కొత్తల్లో మర్రిపాలెంలో వుండేవాళ్లం.

ఆ ఇంటి ఓనర్ తాతారావు ఒక పెద్ద కాంట్రాక్టర్. అందుకే పేద్ద మూడుపోర్షన్ల ఇల్లు, దాని పక్కగా ఒక చిన్న గ్రౌండ్, దాని చుట్టూ మూడు సర్వెంట్ క్వార్టర్లు కట్టి అద్దెకిచ్చి పడేశాడు. సర్వెంట్ క్వార్టర్లంటే ఒక గ్రిల్ల్ రూం, ఒక బెడ్ రూం. చిన్న వంటిల్లు వుండేవి. చిన్న సంసార్లు అందులో అద్దెకి వుండేవారు.

మేం వుండే డాబా ఇంటి ముందు ఒక ఫౌంటెన్ కూడా వుండేది.

మూడు పెద్ద పోర్షన్లు ఒక్కో పోర్షన్ ఒక డ్రాయింగ్ రూం, రెండు బెడ్ రూంలు, ఒక పెద్ద వంటిల్లు వుండేవి.

నిలువుటద్దంతో వుండే డ్రసింగ్ టేబుల్, డైనింగ్ టేబుల్, ఒక డబల్ కాట్ మంచంతో సహా అద్దెకిచ్చాడు.

డబ్బుకి కొదవ లేదేమో అందుకే ఆయన అందరు ఓనర్లలాగా పీనాసితనం ప్రదర్శించేవాడు కాదు. నీళ్లు ధారాళంగా వాడినా, ఫౌంటెన్ మా ఇష్టం వచ్చినంత సేపు వేసుకున్నా అడిగే వాళ్లే లేరు.

ఆ పక్క రోడ్లో వున్న ఒక పెద్ద ఇంట్లో ఓనర్ గారి కుటుంబం వుండేది. ఆయనది పేద్ద కుటుంబం. ముగ్గురు మొగపిల్లలు, ఐదుగురు ఆడపిల్లలు. వాళ్లావిడ సింహాచలం మాత్రం అప్పుడప్పుడు గాలివానలాగా వచ్చిపడి నాలుగు వురుములు ఉరిమి బీభత్సం చేసి పోయేది. పిల్లల్లో ఇద్దరికి పెళ్లిళ్లు అయిపోయాయి. రెండో అమ్మాయి ఎంత అందగత్తెంటే చక్కదనమంతా కుప్పపోసినట్టుండేది. రెండో కొడుకు తెల్లగా ఆడపిల్లలా సుకుమారంగా వుండేవాడు.

మూడో అమ్మాయి నిర్మల. మిగతా ముగ్గురూ చిన్నపిల్లలు బడికి వెళ్లే వారు. నిర్మల చదువు మానేసి ఇంటి దగ్గరే వుండేది . అసలు నిర్మల లేకపోతే ఆ ఇల్లు గడవదేమో అన్నట్టు ఎప్పుడు చూసినా ఏదో పని చేస్తూ వుండేది .

ఆడపని మగపని అనే బేధం లేకుండా ఒక గొడ్డలి పట్టుకుని మేం వుండే ఇంటిపక్క గ్రౌండ్లో వున్న వాళ్ల స్టోర్లో వున్న పెద్ద దుంగల్ని కట్టెలు గా కొట్టుకుని తీసికెళ్లేది.

అప్పుడప్పుడూ వాళ్ల అన్నయ్య బులెట్ మోటారు సైకిల్ని అవలీలగా నడిపేసేది. ఒక్కోసారి కారు కూడా నడిపేది.

నిర్మలని జుట్టు ముడేసుకుని తప్ప చక్కగా జడలేసుకుని ఎప్పుడూ చూడలేదు. సాయంత్రాలు మేము ఆడుకుంటుంటే మాత్రం మాతో ఆటలు ఆడేది. ఆడపిల్లంటే ఇట్టా వుండాలి అనేవారు మా నాన్న .

సుకుమారత్వం ఎరగని బండబారిన చేతులు, నిర్లక్ష్యంగా ముడేసి వదిలేసిన రేగిన జుట్టుతో వున్న తనని నేను ఆరాధనగా చూసేదాన్ని.

తను నన్నుకూడా ఎంతో ముచ్చటగా చూసేది. మేం చదువుకుంటున్నవాళ్లమనో ఏమో !

మేం ఇల్లు మారిపోయినా ఎప్పుడైనా బస్ లో అటేపు వెళ్తా ఆ ఇల్లు , ఫౌంటెన్ చూస్తూ వుండేదాన్ని.

ఏళ్లు గడిచాకా రోడ్ వైండింగ్ లో ఫౌంటెన్ కొట్టేశారు.

ఇంకొన్ని ఏళ్లు గడిచాకా గ్రౌండ్ సర్వెంట్ క్వార్టర్ల స్థానంలో అపార్ట్మెంట్ వచ్చింది. మేమున్న ఇల్లు స్థానంలో రిలయన్స్ స్టోర్ వచ్చింది.

ఆ ఇల్లు మా స్మృతిలో, ఆ ఫౌంటెన్ మా ఫోటోల్లోనూ మిగిలిపోయింది .

ఒక రోజు సినిమాకెళ్తే ఎవరిదో చేయి భుజం మీద పడింది .

తిరిగి చూస్తే నిర్మల. నిర్మల ఇప్పుడు జడేసుకుని ముస్తాబై కనిపించింది. చాలాసేపు పాత కబుర్లు చెప్పుకున్నాం. ఇల్లు మారిపోయినట్టే నిర్మల కూడా మారిపోయింది.

చేతిలో గొడ్డలితో రేగిన జుట్టుతో వుండే నిర్మల ఈ ముస్తాబులో పొందికగా ఎవరో కొత్తమనిషిలా వుంది.

అందరు ఆడపిల్లల్లాగే వుంటే నేను ఆరాధించే నిర్మల ఎందుకవుతుంది...!!

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments